# కుంతీదేవి

మహాభారత యుద్ధము జరిగిన తరువాత కృష్ణుడు హస్తినాపురములో పాండవులతో కొన్ని రోజులు గడిపినాడు. ధర్మజునకు పట్టము కట్టి ద్వారకకు ప్రయాణమయ్యెను. ఈ వార్త తెలిసిన కుంతి వచ్చి కృష్ణుని హస్తములను గట్టిగా పట్టుకొని, 'అనాథరక్షకా! ఆపద్బాంధవా! సర్వేశ్వరా! లోకత్రాణపరాయణా! నా పుత్రులను అనేక కష్టములనుండి కాపాడినావు. విషపీడితుడై అవస్థపడుతున్న భీమునకు అమృతమునిచ్చి రక్షించినావు. నేను మొదటినుండియు మోహములో నివసిస్తున్నాను. ఇది విషస్వరూపమని గుర్తించాను. నీ ప్రేమ అమృతముగా లభించినది. నీ ప్రేమకు మించిన అమృతము జగత్తులో లేదు. బాల్యావస్థయందు మహర్షి అనుగ్రహము వల్ల బడసిన మంత్రమును మోహాతిశయముతో జపించి సూర్యుని వలన కర్ణుని బడసితిని. లోకోపవాదమునకు వెఱచి కర్ణుని గంగలో వదలినాను. ఆనాటినుండి పుత్రశోకముతో కృంగికృశించి పోవుచున్నాను.

తిరిగి పాండురాజును వివాహమాడి పాండవులను కంటిని. ఋషి శాపము తప్పలేదు. మహర్షి అనుగ్రహముచే ధర్మ, భీమ, అర్జునులను బడసితిని. మాద్రికి నకుల, సహదేవులు కలిగిరి. జన్మాంతర సుకృతము వల్ల మాద్రి పతితో సహగమనము చేసినది. పసిపాపలపై మోహముతో ఋషుల దీవెనల నాశ్రయించి బిడ్డలను కాపాడుకొనుచూ వచ్చాను. మహనీయుల అనుగ్రహముచే హస్తినాపురము చేరితిని. దుర్మార్గులైన దుర్యోధనాదులు నా కుమారులపై అనేక చెడ్డలు గావించినారు. లక్క గృహమునందుంచి దహనము గావించుటకు ప్రయత్నించిరి. మహాసాధ్వి ద్రౌపదిని పరాభవించుటకు ప్రయత్నించిరి. ఇలాంటి అనేక సమయములందు నా బిడ్డలను కాపాడుతూ వారికి కావలసిన మార్గమును చూపుతూ తండ్రి స్థానమున ఉండి కాపాడినావు.

తల్లి, తండ్రి, గురువు, దైవము నాటినుండి నీవే. నేడు మేము యిట్లుండుటకు నీ అనుగ్రహ ప్రసాదమే కారణము. బ్రహ్మాండమును బొజ్జలో పెట్టుకున్న నీవు చిన్నవాడవని మోసపోను. సాక్షాత్తు హరివి నీవే! సంశయమునకు అవకాశము లేదు. నిన్ను పొందుటకు బాధలే మూలకారణము. 'కష్టేఫలే' అని రెండు బాధలమధ్య పరమాత్ముడు చిక్కినాడని నాకు ఆనందము కలిగినది. నారాయణా! మురళీధరా! కృష్ణా! నిన్ను విడచి ఒక్కక్షణం ఉండలేను. ఇప్పుడు నీవు ద్వారకకు వెళ్ళుటకు వీలుకాదు. మాధవా! ఇంకా కొంత కాలము ఉండి ధర్మజునికి పరిపాలనా పద్ధతులను తెల్పమని ప్రార్థించింది. ఆ ప్రార్థన విని కొంత కాలమాగాడు.

భగవంతుడు ఏడ్పించుట, కష్టములిచ్చుట మితిమీరిన ఆనందమునందించుకొరకే. మన కడుపులో తిన్నది అరిగిన ఆకలి వేస్తుంది. తిన్న అన్నమే అరగకున్న ఆకలి వేయదు. భక్తునికి కష్టములు, దుఃఖములు అందించి తదుపరి ఆనందము నందిస్తాడు. కనుక, భగవంతుని లీలలు, సంకల్పములు అర్థము చేసుకొనుట కష్టము. అనుభవించిన వారికి అర్థమవును. ఆలోచించిన వారికి అర్థము కాదు. అంతర ఆనందమును లోలోన యిచ్చును. భౌతిక ఆనందములు క్షణభంగురములు. ఇట్టి సత్యాన్ని గుర్తించిన కుంతి కృష్ణ ఎడబాటును సహించలేకపోయినది.

కృష్ణుడు నిర్యాణము పొందిన తర్వాత అనేక కష్టములకు లోనై అర్జునుడు హస్తినాపురమునకు చేరుకున్నాడు. తరువాత అనేక అపశకునములు కన్పించినవి. వచ్చిన తక్షణమే నిర్వాణ వార్త చెప్పినాడు. భరించలేకపోయినారు పాండవులు. కృష్ణుడు ఉండినంతవరకు సర్వశక్తులు పొందిన అర్జునుడు అతను లేక నారికూడా కట్టలేకపోయాడు. ఇంతకు పూర్వమున్నవి కృష్ణ శక్తులు. తాను తోలుబొమ్మ అనే సత్యాన్ని అర్జునుడు గుర్తించుటయేకాక, కన్నులు కనిపించక తన రాకకై యెదురు చూచుచున్న తల్లికి యేవిధముగా చెప్పవలెనని తలచుచూ అంతఃపురములో ప్రవేశించెను. అర్జునుడు వచ్చినాడని కుంతి వచ్చినది. 'నీ మేనమామ కుశలమా? కృష్ణుడు ఎప్పుడు వస్తాడు?' అని ప్రశ్నల వర్షము కురిపించింది. అర్జునుడు భోరున యేడ్చి పాదములపైబడి, 'ఇంకెక్కడ కృష్ణుడు! మనలను వదలినాడు' అని తెలిపినాడు. 'కృష్ణుడు వెళ్ళినాడా!' అని ప్రాణము విడిచింది. ఈ వార్తను విని కృష్ణుని వెదకుటకు వెళ్ళినట్లుగా వెళ్ళినది.